ఇందిరమ్మ పథకం కింద కట్టించినవి. దాదాపు శిథిలావస్థలో ఉన్నాయి. ఏ ఇంట్లోనూ తల్లిదండ్రులు లేరు. ప్రతి ఇంట్లోనూ ముసలివాళ్లు, పెండ్లికాని ఆడపిల్లలు, రెండు మూడేళ్ల వయసు పిల్లలు మాత్రమే ఉన్నారు.

ఆడపిల్లలకు సాధారణంగా పన్నెండేళ్లు ఆపై వయసు లోపే పెళ్లిళ్లు చేస్తారు. గంగెద్దులాడిస్తూ, బిచ్చమెత్తుకుంటూ కొందరు జీవిస్తే ఇంకొందరు వ్యవసాయంతో పాటు చిన్నచిన్న వ్యాపారాలు చేస్తారు.

పిల్లలు రోజూ బడికి పోతున్నారా? చదువుతున్నారా లేదా? వాళ్లకు కావలసిన పుస్తకాలు, నోట్‌బుక్కులు ఉన్నాయా? ఇలాంటి విషయాలేవీ వాళ్లకు పట్టవు. తోబుట్టువులను చూసుకోవడానికి ఎక్కువమంది పిల్లలు ఇంటి వద్దే ఉంటారు. పదేండ్ల వయసున్న మగపిల్లలు చదువు మధ్యలోనే మానేసి, కంట్రోల్ బియ్యం కొనడం – అమ్మడం, వేటకు వెళ్లడం వంటి పనులు చేస్తూ డ్రాపవుట్స్‌గా మిగిలిపోతారు. వాళ్ల కాలనీకి ఎప్పుడు వెళ్లినా, పేరెంట్స్ ఎవరూ ఉండరు.

ఇంట్లో ఉన్న ముసలివాళ్లను కదిలిస్తే..

''ఏం జెయ్యమంటరు సారూ! ఆల్లు బేరానికి పోతేనే ఇల్లు గడుస్తది. ఇగ సదువంటే ఆల్లకు అచ్చే కాడికస్తది తియ్యండ్రి'' అంటారు.

''జీవన పోరాటంలో అనివార్యంగా వాళ్లు ఇల్లు విడిచి వెళుతున్నారు. వాళ్ల ఆర్థిక వెనుకబాటుతనమే వాళ్ల అజ్ఞానానికి కారణం'' అని రమ్య మేడంతో అనగానే..

''వాళ్లేమీ ఆర్థికంగా పూర్తిగా లేమిని అనుభవిస్తున్న వాళ్లుకాదు సార్. ఎవరి ఇండ్లలో ఏ శుభకార్యమైనా, చావులాంటి అశుభకార్యమైనా వాళ్ల ఇండ్ల ముందు గుంపుగా వాలి వేలకువేలు వసూలు చేస్తారు. ఒక్కొక్కరికీ రెండు నుంచి పది ఎకరాల భూములన్న వాళ్లూ ఉన్నారు. లక్షల రూపాయలు వడ్డీకి తిప్పుతారు''.

ఈసారి ఖంగుతినడం నా వంతయ్యింది. పరస్పర విరుద్ధ అంశాలు నా అనుభవంలోకి వచ్చేసరికి, ఏది నిజమో తెలుసుకోలేని సందిగ్ధావస్థలో పడిపోయాను.

* * *

మధ్యాహ్నం పిల్లలు భోజనం చేస్తున్న సమయంలో రెండో తరగతి చదువుతున్న వంశీ తల్లి ఏడుస్తూ, అరుస్తూ రువ్వడిగా వచ్చింది. తింటున్న వాణ్ని తింటున్నట్టే లేపి చెయ్యి పట్టుకొని గుంజుకు పోసాగింది.

''ఏమైందమ్మా.. అన్నమైనా తినకుండా వాణ్ని అట్లా గుంజుకు పోతున్నావు'' అని అడగ్గానే..

''బతుకే బాయిల వడ్డట్లయ్యింది. బువ్వనెవడడిగిండు సార్'' అంటూ పోతనే ఉంది.

నాకేమీ అర్థం కాకుండా అలాగే ఉండిపోయాను.

మధ్యాహ్న భోజనం వండే వెంకటమ్మ..

''పెండ్లం మొగని పంచాతి సారు. ఇది ఉండంగనే ఇంకోదాన్ని తెచ్చుకున్నడు. ఇది తిరగవడితే రాత్రి బాగా తాగచ్చి ఇయ్యరమయ్యర కొట్టిండు. 'ఎవనితో జెప్పుకొంటవో చెప్పుకో.. పో!' అని బరితెగించితే, అది పోలీస్ స్టేషనుకు పోతంది'' అన్నది.

''ఈ అమ్మాయి నా స్టూడెంట్ సార్. ఏడవ తరగతి పూర్తికాగానే చదువు మానిపించి పెండ్లి చేశారు. ఇక్కడి ఆడ పిల్లలందరి పరిస్థితి కొంచెం అటుఇటుగా ఇంతే ఉంటుంది'' అంది రమ్య మేడం.

''బాల్య వివాహాలు నిరోధించడానికి పోలీస్, రెవెన్యూ యంత్రాంగముంది కదా! వీటికి అడ్డుకట్ట వేసే ప్రయత్నాలేవీ జరగడం లేదా? మేడం'' అంటే..

''ప్రభుత్వ యంత్రాంగం వీళ్ల కోసం అవేర్‌నెస్ క్యాంప్ ఏర్పాటుచేస్తే, అంతా తిరగబడి రాళ్లతో కొట్టి ఉరికించిన చరిత్ర వీళ్లది. వీళ్లను ఎవరూ మార్చలేరు సార్. అన్నీ మూర్ఖమైన ఆలోచనలే. చేసుకున్న దానిమీద మోజు తీరిపోతే, కుల పంచాయితీ పెట్టి లక్షలకు లక్షలు పోసి విడాకులిచ్చి వేరేవాళ్లను చేసుకుంటారు. పోలీసులు, కోర్టులు వాళ్లకు లెక్కలేదు సార్''.

బాల్య వివాహాలు ఆగాలంటే వాళ్లకు చదువు అందాలి. ముఖ్యంగా ఆడపిల్లలకు. ఎలాగైనా ఈ అనాచారాన్ని ఆపేందుకు ఏమైనా చెయ్యాలి అనుకున్నాను.

మాది ప్రాథమికోన్నత పాఠశాల. అంతా పదమూడేళ్ల లోపు పిల్లలే. కొందరు పెద్ద పిల్లలు నా మాటల్ని శ్రద్ధగా వింటారు. వాళ్లవంటూ సొంత ఆలోచనలు రూపుదాల్చని పసి వయసులో వాళ్ల అమ్మానాన్నల మాటలు వాళ్ల మీద ఒక ముద్రను వేస్తున్నాయని నాకర్థమైంది. వాళ్లకు కొత్త ఆలోచనలను, కొత్త ప్రపంచాన్ని పరిచయం చేయాలనుకున్నాను. తినడానికి తిండిలేని నిరుపేదలు, అంగవైకల్యంతో బాధపడే అసహాయులు, చదువు అనే దీపపు వెలుగులో ఎన్ని విజయాలు సాధించారో నా ట్యాబ్‌లోని వీడియోలను చూపించి, సాధారణ భాషలో వారి మనసుకు హత్తుకొనే విధంగా వారిని మోటివేట్ చేయడం మొదలుపెట్టాను.


ఒకరోజు కాలనీలో మీటింగ్ పెట్టి తల్లిదండ్రులతో మాట్లాడాలనుకున్నాను. అయితే, రమ్య మేడం గతంలో జరిగిన విషయాల గురించి చెప్పింది గుర్తొచ్చింది. అందుకే బాల్యవివాహాల గురించి అని చెబితే ఎవరూ రారని, మహిళల ఉపాధి కోసం మార్గాల గురించి అని మాత్రమే చెప్పాను. అధికారులు, పేరు మోసిన రచయిత్రులు, కౌన్సిలర్స్‌ను తీసుకువచ్చాను. ముందుగా మహిళలకు గల ఉపాధి అవకాశాల గురించి మాట్లాడించి మెల్లగా ఆడపిల్లల చదువు ప్రాధాన్యత గురించి, బాల్య వివాహాల వల్ల సంభవించే శారీరక సమస్యలతోపాటు, బాల్యవివాహాల వల్ల సామాజిక వివక్షకు, వెనుకబాటుకు ఎలా గురవుతారన్న విషయాన్ని చెప్పగానే మీటింగులో కలకలం మొదలైంది.

సాయంత్రం ఏర్పాటుచేసిన మీటింగ్ కావడం వల్ల పనులు ముగించుకొని, బాగా తాగి వచ్చిన వాళ్లు ఆవేశంగా మాట్లాడటం మొదలుపెట్టారు.

''ఏంది సారూ! మా ఆడోల్లకింత పైసలు దొరికే పనుల గురించి చెప్పుతనని, గీ లేనిపోని రామాయణం మొదలు పెట్టిచ్చినవ్. నీకేమైనా మతుందా. మా ఆడివిల్లగాండ్లను ఎంతదాంక సదివియ్యాన్నో.. ఎప్పుడు లగ్గం జెయ్యాన్నో మా కెరుకనే. నువ్వేంది జెప్పేది. టీవీలల్ల, సినిమాలల్ల సూత్త లేరా.. పేమా దోమా అని ఎన్ని కతలు వడుతున్నరో! కులంగానోడు, తలంగానోడు ఎవనెంటనో పడిపోతే నువ్వేమన్నా కావలుంటవా!? నాలుగొద్దులు సదువు జెప్పుకొని పోయెటోనివి.. గంతల్నే ఉండు. మా పోరగాండ్లయి, మాయి దమాఖ్‌లు ఖరాబు జేత్తనని జూత్తే మంచిగుండది. ఏదో బడి సారువని ఇడ్సివెడ్తున్నం. మీటింగ్ లేదు.. గీటింగ్ లేదు ఛల్ దొబ్బేయిండ్రి!'' అంటూ ఒక్కసారిగా పరిస్థితిని భయానకంగా మార్చేశారు.

ఊహించిందే కావడంతో మేము కూడా వెంటనే మీటింగ్ ఆపేశాం. అయినా నేను నా ప్రయత్నాన్ని విరమించుకోదల్చుకోలేదు. వందల సంవత్సరాలకు ముందే ఆ మహాతల్లి సావిత్రిబాయి పూలే మహిళలకు చదువు అందివ్వడానికి ఛాందస సమాజాన్ని ఎదిరించి ఎన్ని కష్టాలకో ఓర్చి ముందడుగేయకుంటే.. మహిళలకు చదువు దక్కేదా!? ఇప్పటి ఈ వెలుగులన్నీ ఆ తల్లి తన రక్తాన్ని చమురుగా చేసి వెలిగించిన దీపాలే కదా!

నాకున్నదల్లా. ఇక పిల్లల మెదళ్లలో అభ్యుదయాంకురాల్ని మొలిపించడమే. వాళ్ల పూర్వీకులు విద్యకు దూరంగా ఉండటం వల్లనే ఈ తరం పసిమొగ్గలు పూసీ పూయకుండానే రాలిపోతున్నారు. బ్రహ్మలిపి ఏమోగానీ తల్లిదండ్రులే వారి నుదుటన అజ్ఞానలిపిని రాస్తున్నారు. ఇది ఇలాగే కొనసాగితే వచ్చే తరాలు కూడా ఇదే చీకటిలో మగ్గిపోతాయి. వీళ్లలో కాంతిని పంచగలిగే ఒక్క జ్యోతినైనా నేను వెలిగించగలనా? నేను వేసుకున్న ప్రశ్నకు సమాధానంగా నాకు వసంత కనిపించింది. తెలివైనది. నా మాటలపట్ల ఆకర్షణ, విశ్వాసం మెండుగా ఉన్న అమ్మాయి. ఈ ఒక్కదాన్ని మార్చగలిగినా.. ఒక దీపం మరికొన్ని దీపాల్ని వెలిగించినట్లు, వాళ్ల సామాజిక వర్గంలో మార్పునకు దోహదపడే రోల్ మోడల్‌గా నిలిచి



'నమస్తే తెలంగాణ, ముల్కనూరు సాహితీపీఠం' సంయుక్తంగా నిర్వహించిన 'కథల పోటీ-2023/24'లో రూ.3 వేల బహుమతి పొందిన కథ.